# కొసమెరుపు

-నల్లాన్ చక్రవర్తుల గోపీమాధవులు

గంగాధరానికి అసహనంగా వుంది. తిక్కతిక్కగా వుంది. గుక్క తిప్పుకోకుండా భార్యను తిట్టాలని వుంది. కానీ ఆ భార్యామణి ఎదురుగా లేదు. అలాగని పాపం ప్రతిరోజూ భార్యను తిట్టడం ఆయనకు క్రమం తప్పని అలవాటేమీ కాదు. సుమారు మూడు గంటలుగా సతీమణి పార్వతమ్మ కనిపించలేదు. ఎక్కడికెళ్లిందో తెలీదు.

టీపాయ్ మీద వున్న దినపత్రికను చేతిలోకి తీసుకున్నాడు. 'ముందస్తు ఎన్నికల్లో గెలుపు ఎవరిది?' పెద్ద పెద్ద అక్షరాలతో సామాన్య ఓటరుని రెచ్చగొట్టే యెదవ బ్యానర్ ఐటమ్. ముందస్తు ముందస్తు..వీళ్ల బొందస్తు..ఎవడు గెలిస్తే ఒరిగేదేముంది?

ఐనా ఈ విషయం తనకెందుకులే. ఇంతకీ పార్వతి ఎక్కడికెళ్లినట్టు? సోఫాలో నుండి లేచి సరిగ్గా రెండున్నర పచార్లు చేసి నిలబడిపోయాడు గంగాధరం. అలా పచార్లు చేసినంత మాత్రాన పార్వతి వచ్చేస్తుందా? రాదు. అందుకే ఏదో చేయాలి. ఠక్కున ఏదో ఆలోచన వచ్చినవాడిలా ఫోన్‌ని ఒళ్లోకి తీసుకున్నాడు. గబగబా ఓ నెంబర్ కలిపాడు. తను 'హలో' అని కూడా అన్న పాపాన పోకుండానే తన మేనకోడలు సుహాసిని గడ గడా మొదలెట్టేసింది. "హలో ఏ టీవీ నుండేనా? థాంక్యూ మేడమ్! థాంక్యూ వెరీమచ్. మీరు ఫోన్ చేస్తారని ఎక్స్‌పెక్ట్ కూడా చేయలేదండీ.మీ యాంకరింగ్ చాలా బావుంటుంది మేడమ్. అసలు..అసలు మీరు ఫోన్ చేసేసరికి నాకు మాటలు రావడం లేదండీ.."

"నీ బొంద. ఇంతవరకూ ఎంటీవీ ఎంకమ్మలా వాగి మాటలు రావడం లేదంటావేంటే? ఐనా ఫోన్ చేసిందెవరో చూసుకోవక్కర్లా?" కోపంగా అన్నాడు గంగాధరం.

"హయ్యో..నువ్వా ధరం మామయ్యా..ఇంకా ఏ టీవీవాళ్లేమో అనుకుని ఎంత సంబరపడిపోయానో. ఊ చెప్పు ఏంటో?" నిర్లిప్తంగా అంది సుహాసిని.

"అదేవిటే? నేను ఫోన్ చేయక ఎన్నిరోజులైందీ, అంతిదిగా మాట్టాడతావేంటీ? అక్కడికి మీ అత్తయ్య వచ్చిందేమిటి?"

"లేదు. రాలేదు. ఎందుకు మామయ్యా, ఎక్కడికెళ్లిందీ?"

"అదెక్కడికెళ్లిందో తెలిస్తే నేను మీకెందుకు ఫోన్ చేస్తానే మొద్దుమొహమా? ఇంతకీ అక్కడికొచ్చిందా, రాలేదా?"

"ఏమో..ఇక్కడికైతే రాలేదు మరి! అమ్మా, నాన్నా, తమ్ముడూ, చెల్లెళ్లూ అంతా బావున్నారు గానీ, నువు ఫోన్ పెట్టెయి మామయ్యా! ఏ టీవీ వాళ్లు చేస్తే ఎంగేజ్ వచ్చిందనుకో, వాళ్లు మళ్లీ మళ్లీ చేయరు!" చికాగ్గా అంది సుహాసిని.

"నీ మొహం మండ. సర్లే, మీ అత్తయ్య గనక వస్తే అర్జెంటుగా ఫోన్ చెయ్యి!"

"సర్లే"

వెంటనే ఫోన్ డిస్కనెక్టయింది. గంగాధరానికేదో ఆలోచన వచ్చింది. వెంటనే సోఫాలో నుండి లేచి కండువా భుజాన వేసుకుని బయల్దేరాడు.

★ ★ ★

వెధవ ఎండ, ముదనష్టపు ఎండ, దరిద్రపు ఎండ..ఎప్పుడూ విరగకాయడమేనా? కాస్సేపు వూరుకోవద్దూ... చెమటలు కక్కుతూ ఓ రెసిడెన్స్ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నాడు గంగాధరం.

"టహ్‌రో సాబ్! కిస్‌కా ఘర్‌కో జానా హై?" గూర్ఖావాడు కర్కశంగా అడ్డుకున్నాడు. పెద్ద ట్రాజెడీ. గంగాధరానికి జీవితంలో హిందీ అన్న పదం తప్ప ఆ భాషలో ఒక్క పదమూ వచ్చి ఏడవదు.

"నోర్మూయ్..నీ వెధవ భాషతో నన్ను హడలగొట్టాలని చూస్తున్నావా? నేను బెదిరే మనిషిని కాను. మావాణ్ణి పిలిచానంటే నిన్ను చావగొట్టేస్తాడు" అన్నాడు ధరం దర్జాగా.

"నహీ సాబ్! ముఝే తెలుగు నహీ మాలూమ్..హిందీమే బోలియేనా? ఆప్ కో కిస్‌కా ఘర్‌కో జానా హై?" మళ్లీ అదే అమాయకమైన ప్రశ్న.

"అదిగో మళ్లీ? ఏంటా వెధవ కూతలు? పోలీసులకు చెప్పానంటే నీకూ, పాకిస్తానీవాడికీ వున్న సంబంధమేమిటో బయటకి లాగుతారు. అప్పుడు ఊచలెక్కెడుదువుగానీ" గంగాధరం మాటల్లో బెట్టు తగ్గలేదు. సరిగ్గా అప్పుడే అదృష్టానికి అటుగా కృష్ణమూర్తి వచ్చాడు. అతడు గంగాధరం తమ్ముడు విష్వక్సేన ఇంటికి ఎదురుగానే వుంటాడు.

"ఓ మీరా? ఏంటీ, ఏం జరిగిందీ?" అంటూ వాళ్లిద్దరి వద్దకు వచ్చాడు.

"వీడు చూడండీ, పరాయిదేశం నుండి వచ్చినవాడు మనల్ని బెదిరించాలని చూస్తున్నాడు. పాకిస్తానీ వాళ్లు వీళ్లను సివిల్ డ్రెస్సుల్లో పంపిస్తున్నారు. వీళ్లిక్కడ సమాచారాన్ని సేకరించి వాళ్లకు చేరవేస్తున్నారు" ధరం మాట అక్కడికి ఆగేలా లేదు.

"క్యా హువా భాయ్? క్యోం సతారహే హో?" అన్నాడు కృష్ణమూర్తి గూర్ఖావాడివైపు తిరిగి.

"నహీ సాబ్, మైనే పూఛా కీ కిస్‌కే ఘర్‌కో జానాహై? తో తెలుగు మే గాలియా దేనా షురూ కర్ దియా" అని కృష్ణమూర్తికి దీనంగా ఫిర్యాదు చేశాడు గూర్ఖావాడు.

"అచ్ఛా, అచ్ఛా..గంగాధరంగారూ! వాడడిగింది మీరు ఎవరింటికి వెళ్లాలీ అని" అని మూర్తి సర్దిచెప్పాడు.

"మరి ఆ విషయమేదో సరిగ్గా ఏడవచ్చుగా?"

"సర్లెండి. నేను చెప్పానుగా? పదండి వెళ్దాం" అంటూ కృష్ణమూర్తి దారితీశాడు.

ధరం వగరుస్తూ తమ్ముడి ఇంటి ముందుకి చేరుకుని, కాలింగ్ బెల్ నొక్కాడు. అంతే..

భళ్లున తలుపులు తెరచుకున్నాయి. బెల్ నొక్కగానే అంతటి ప్రతిస్పందన వుంటుందని గంగాధరం కలనైనా ఊహించలేదు. విష్వక్సేన అండ్ ఫ్యామిలీ మంగళహారతితో పాలోమని బయటకు వచ్చేశారు. వాళ్ల అవతారాలను చూసి ధరం అవాక్కయ్యాడు. విష్వక్సేన పట్టుబట్టలు కట్టుకుని వున్నాడు. అతడి సతీమణి జగదాంబ పట్టుచీర, నగలతో ధగధగమని వెలిగిపోతోంది. పిల్లలు కూడా కొత్తబట్టలను ధరించారు.

"ఏవిట్రా ఇదీ? నాకు మంగళహారతి పట్టడమేంటీ? అసలు నేను వస్తున్నట్టు మీకెలా తెలుసూ?" సంభ్రమాశ్చర్యాలతో అన్నాడు గంగాధరం.

విష్వక్సేన పెదవి విరిచాడు. "ఖర్మ. నువ్వా అన్నయ్యా? మేమింకా 'ఛీ' టీవీ యాంకరనుకుని ఈ హంగామా అంతా చేశాం. అదిగో చూడు.. ముందు గదిలోకి టీవీని బరబరా లాక్కొచ్చి 'ఛీ' టీవీనే ఆన్ చేసి వుంచాం" ధరానికేమీ అర్థం కాలేదు. "టీవీ యాంకర్లొస్తే ఈ హడావుడంతా ఎందుకురా?"

"మరే, వాళ్లు 'చంపితే చెంగల్పట్టు' అనే కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నారన్నయ్యా! మన





అడ్రస్, ఫోన్ నెంబర్ పంపిస్తే చెప్పాపెట్టకుండా వాళ్లు ఓ పట్టుచీరను పట్టుకుని మనింటికి వచ్చేస్తారు. అప్పుడు వాళ్ల ఛానెల్ ఆన్ చేసి వుండి, వాళ్ల డిగే ప్రశ్నలకు సరైన సమాధానాలివ్వగలిగితే ఆ పట్టుచీర మనదే..'' సోదాహరణంగా వివరించాడు విష్వక్సేన.

"సరే..లోపలికి పదన్నయ్యా..నేనసలు 'ఛీ' టీవీ వాళ్ల గురించే ఐదు రోజుల నుంచీ సెలవుపెట్టి మరీ ఇంట్లో వున్నాను'' అంటూ లోపలికి నడిచాడు విష్వక్సేన.

ధరానికి చిర్రెత్తిపోయింది. "అంతలా టీవీ పిచ్చేంట్రా? నీకేమైనా బుద్ధుందా అసలు? ఏ ఇంట్లో చూసినా ఎప్పుడూ టీవీలు మోగుతుంటాయి, ఆ ఛానెళ్లల్లో వచ్చే దరిద్రపు సీరియళ్ల గురించి చర్చించుకుంటుంటారు. మరీ, ప్రైవేట్ ఛానెల్స్ వచ్చిన తర్వాత సమాజం బొత్తిగా నాశనమైపోయింది. ఏదో ఉద్యమం వచ్చి ఈ ఛానెల్స్‌ని నిషేధిస్తే తప్ప సమాజం బాగుపడదు. నిజానికి..'' ధరం వాక్ప్రవాహాన్ని ఆపమన్నట్టుగా విష్వక్సేన చిన్నకూతురు డాలీ మంచినీళ్లు పట్టుకొచ్చి భక్తిగా పెదనాన్నగారి చేతిలో వుంచింది.

"మంచినీళ్లు తాగన్నయ్యా..ఆయాసం వస్తుంది''

"రాదు. నాకు మంచినీళ్లు కాదుగదా, విషం పుచ్చుకున్నా ఆయాసం రాదు''

"అబ్బే, నా ఉద్దేశం తాగకపోతే వస్తుందని?''

"సరేగానీ, మీ వదినగానీ ఇటువైపేమైనా వచ్చిందిరా?''

"లేదన్నయ్యా...ఏం? నీకు చెప్పాపెట్టకుండా వెళ్లిందా?'' కంగారుగా అడిగాడు విష్వక్సేన.

"అందుకే కదా ఇంతిదిగా పరిగెత్తుకొచ్చా. సీతారావమ్మక్కయ్య ఇంటికి ఫోన్ చేశా. రాజశేఖరం అన్నయ్య ఇంటికి వెళ్లా. ఎక్కడా లేదు'' కొంత భయంగా అన్నాడు ధరం.

"సరే, నేను కనుక్కుంటానుగానీ, నువు భోజనం చేసి అలా నడుం వాల్చు అన్నయ్యా. మధ్యాహ్నం కనీసం అరగంటైనా నిద్రపోవడం నీకు అలవాటు కదా?''

మారుమాట్లాడకుండా ధరం లేచి కాళ్లు చేతులు కడుక్కున్నాడు. మరదలు వడ్డిస్తూంటే అవురావుమని భోంచేశాడు. మంచంమీద అలా నడుం వాల్చగానే పిలిచినట్టుగానే కునుకు వచ్చి కంటిమీద వాలింది.

* * *

సుమారు గంటంపావు గడిచాక ఫోన్ మోగుతుంటే గంగాధరానికి చప్పున మెలకువ వచ్చింది. వెళ్లి ఫోనందుకున్నాడు. బయటి నుండి పార్వతమ్మ పలికింది.

"హలో..ఎవరరా విశ్వమేనా?''

"కాదు, నీ పతిమొగుడు వెధవ. నీకేమైనా బుద్ధుందా అసలు? ఎక్కడేడ్చావ్?'' కోపంగా అన్నాడు ధరం.

"శ్రీవాణి ఇంట్లో వున్నానండీ! 'ఏమని' టీవీలో నాలుగేళ్లుగా వస్తున్న 'చీల్చి చంపుతా' సీరియల్ నాకెంత ప్రాణమో మీకు తెలుసు కదా? ఇవాళ మన ఏరియాలో కరెంటు వుండదని ప్రొద్దున్నే తెలిసింది. అందుకే శ్రీవాణి ఇల్లు ముప్పై కిలోమీటర్ల దూరం వుంటే వుందిలే, సీరియల్‌కంటే ఎక్కువా అని వచ్చేశాను. మీరు ఇంటికి వెళ్లిపోండి. నేను వచ్చేస్తాను''

"నీ మొహం! ఎంత కంగారుపడ్డానో తెలుసా?'' అంటూ యధాలాపంగా గోడగడియారం వంక చూసి, గావుకేక పెట్టాడు ధరం.

ఆ కేకకి విష్వక్సేన అండ్ పార్టీ ఉలిక్కిపడింది.

ధరం తన ప్రసంగాన్ని కొనసాగించాడు. "ఇప్పుడు టైమెంతో తెలుసా? సాయంత్రం ఐదయింది. సుమారు పదేళ్లుగా 'ఛీ' టీవీలో వస్తున్న 'మంత్రిగారి కొడుకులు' సీరియల్‌ను ప్రాణప్రదంగా చూస్తున్నాను కదా? ఇప్పుడు పదిహేను నిముషాల్లో ఇల్లెలా చేరుకోను? సర్లే, ఇక్కడ ఆ సీరియల్ చూసి నేను బయలుదేరుతాను. ఎక్కడ మొదలవుతుందో ఏవిటో..సోది ఆపి పెట్టెయ్'' పార్వతమ్మ జవాబు కోసం కూడా చూడకుండా రిసీవర్ క్రెడిల్ చేశాడు గంగాధరం.

విష్వక్సేన అండ్ కో అవాక్కయింది.

★